


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	2,74,007	2,74,007
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,137.95	633.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.406 (41.8320)	2,00,630	1,35,683

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240



దసరాకు 705 బస్సులు

- ప్రత్యేక బస్ సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళిక
- స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం
- పండుగ తరువాత మరో మూడు రోజులు కూడా
- డిమాండ్‌ను బట్టి ఆయా రూట్లలో అదనంగా..

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి 705 స్పెషల్ బస్ సర్వీసులను నడపాల ని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నల్లగొండ రీజియన్ రూపొందించిన నివేదికకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ఆమోదం తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

దసరా సందర్భంగా ప్రత్యేక బస్ సర్వీసులను నడిపించేందుకు సంస్థ షెడ్యూల్‌ను రూపొందించింది. దసరా స్పెషల్ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడు డిపోల పరిధిలో 680 బస్సులు పలు రూట్లల్లో నిత్యం 2.60లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. అందుకు సంస్థకు ప్రతీ రోజు రూ.1.50కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రతీడిపో నుంచి హైదరాబాద్‌తో పాటు దూర ప్రాంతాలన్నింటికీ దసరా సందర్భంగా బస్సులు నడపనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు ప్రజలను చేరవేయడం కోసం హైదరాబాద్‌కు ఎక్కువగా సర్వీసులు నడపనున్నారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ బస్సులకు సంబంధించి కొన్ని రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. వాటిలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగించనున్నారు. రీజియన్‌లో డిమాండ్‌ను బట్టి అదనపు బస్సులు పెంచనున్నారు. పండుగ సందర్భం గా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా వారి గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు ప్రధానంగా పల్లెలకు గ్రామాలకు స్పెషల్ బస్సులు నడపనున్నారు.

20 నుంచి స్పెషల్ బస్సులు...

ప్రభుత్వం పాఠశాలలకు ఈనెల 21 నుం చి అక్టోబరు 3వ తేదీ వరకు దసరా సెలవుల ను ప్రకటించింది. అదేవిధంగా కళాశాలలకు ఈనెల 28 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు సెలవులు ఇచ్చింది. బతుకమ్మ పండుగ ఈ నెల 21న ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు కొనసాగి 30వ తేదీన సద్దుల బతుకమ్మతో ముగియనుంది. బతుకమ్మ, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు, దసరా నేపథ్యంలో ఈనెల 20వ తేదీ నుంచే ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది. ప్రయాణికులను వారి గమ్యాలకు చేరవేయడంతో పాటు ఆదాయం కూడా సమకూర్చుకునేందుకు పండుగకు ముందస్తుగానే బస్సు సర్వీసులు నడిపేందుకు నిర్ణయించింది. దసరా సెలవుల్లో పట్టణ ప్రాంతాల నుంచి అధికంగా పల్లెలకు వెళ్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అక్టోబరు 2వ తేదీ వరకు మొత్తం 13 రోజుల పాటు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి స్పెషల్ బస్సులు నడిపిస్తారు. అదేవిధంగా గ్రామాలకు వెళ్లిన వారు పండుగ తరువాత 3, 4, 5 తేదీల్లో పట్టణాలకు తిరుగుముఖం పడతారు. ఈ రోజుల్లో కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను ఎంచుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. అదేవిధంగా మహిళలకు ఉచిత ప్రయాణంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ వస్తున్న నేపథ్యంలో సంస్థ మహిళా ప్రయాణికుల కోసం పెద్ద సంఖ్యలో బస్సులు నడపనుంది.

డిపోల వారీగా బస్సుల సర్వీసులు ఇలా...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు డిపోలు ఉన్నాయి. ఈనెల 20 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నడిపే బస్సుల వివరాలను ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ఆ తరువాత మరో మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులను కొనసాగించనున్నారు. ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటే అదనంగా మరో 30 నుంచి 50సర్వీసులను అప్పటికప్పుడే నడిపేలా ఏర్పాట్లు చేశారు. దేవరకొండ డిపో పరిధిలో 131 బస్సు సర్వీసులు, కోదాడ పరిధిలో 94

- మిగతా 6వ పేజీలో...

16 నుంచి కళాశాలలు బంద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో..



హైదరాబాద్ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రైవేట్ కళాశాలల యజమానులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఈ నెల 16 నుంచి బంద్ నిర్వహించనున్నాయి. గతంలో 40 రోజులు సమ్మె నిర్వహించగా, ప్రభుత్వం మూడు రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని నాడు హామీ ఇచ్చింది. ఈ హామీ నెరవేరకపోవడంతో మళ్లీ బంద్ పాటించాలని యాజమాన్యాలు నిర్ణయించాయి.

- (ఆంధ్రజ్యోతి, మోత్కూరు)

పట్టభద్రులైన నిరుద్యోగులు కొందరు పలువురు విద్యార్థులకు విద్య అందించడంతోపాటు స్వయం ఉపాధి, మరికొందరికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఇచ్చే ఫీజులపై ఆధారపడి ఇవి నడిచేవి. అయితే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో నాటి నుంచి ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి నడుస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఏడాది, ప్రస్తుత కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చే య లేదు. దీంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వందే కళాశాలలు నడపలేమంటూ ఈ నెల 16 నుంచి నిరవధిక బంద్‌కు వెళ్లనున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి ఇటీవల కళాశాలల యాజమాన్యాలు సమ్మె నోటీసు అందజేశాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 62 ప్రైవేట్ డిగ్రీ, 15 పీజీ కళాశాలలు


ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 62 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, 15 ప్రైవేట్ పీజీ కళాశాలలు ఉన్నాయి. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సుమారు 16వేల మంది విద్యార్థులు, పీజీ కళాశాలల్లో సుమారు 2వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో అత్యధిక భాగం నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉన్నారు.

మూడేళ్లుగా బకాయిలు

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఏడాది, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల ఉపకార వేతనాలు విడుదల చేయలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ కళాశాలలకు 2022-23,2023-24,2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.250కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో టోకెన్ ఇచ్చిన మొత్తం.

- మిగతా 6వ పేజీలో...

వెంటనే నిధులు విడుదల చేయాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏప్రిల్, మే మాసాల్లో 40 రోజులు సమ్మె చేశాం. మూడు రోజుల్లో కొంత బకాయి చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. ఇప్పటికే పలుమార్లు డిప్యూటీ సీఎంతో పాటు పలువురు మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశాం. ఉన్నత విద్యాశాఖ అధికారులను కలిశాం. అయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదు. భవనాలకు అద్దె, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నాం. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 16 నుంచి నిరవధిక బంద్‌కు వెళ్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి కళాశాల యాజమాన్యాలకు, విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలి.

- సత్యంగౌడ్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, నల్లగొండ

వీధి కుక్కలను దత్తత తీసుకోవడం అభినందనీయం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కుక్కల దత్తత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలను దత్తత తీసుకోవడం అభినందనీయమని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కుక్కలను నియంత్రించేందుకు వాటిని చంపడం పరిష్కారం కాదని, వాటి సంతతిని నిరోధించడం, దత్తత తీసుకునేలా ప్రోత్సహించడం మంచి ప్రయత్నమని అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ పార్కులో నిర్వహించిన కుక్కల దత్తత, స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వీధి కుక్కలపై నియంత్రణ లేకపోవడంతో ఇటీవల కుక్కల బెడద పెరిగిందని, కుక్క కాట్లతో విషాదకర ఘటనలు నెలకొన్నాయన్నారు. ఈసమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని, అందులో భాగంగానే వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేయడంతో పాటు వాటిని పెంచుకునేందుకు దత్తత తీసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వివరించారు.రాష్ట్రంలో హైదరాబాద్ నగరం తర్వాత నల్లగొండలోనే ఈ దత్తత కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, సామాజికపరమైన ఇలాంటి అంశంపై సరైన రీతిలో స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని మంత్రి అభినందించారు. జిల్లాలో సుమారు 40 వేల కుక్కలు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోందన్నారు. అనంతరం 49కుక్కలను దత్తత తీసుకున్న వారిని మంత్రి అభినందించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో 92వేల గృహాలు ఉండగా, ఒక్కొక్కరు ఒక్కో కుక్కను దత్తత తీసుకుంటే వాటి బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఏఎస్పీ మౌనిక, రమేష్, డీఎఫ్‌వో రాజశేఖర్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రమేష్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి

పురుషులతో పాటు, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్బీసీ కాలనీ సమీపంలో జిల్లా మహిళా సమాఖ్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త రూ.5కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ పంపునకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల ద్వారా కట్టంగూరు మండలం అయిటిపాములలో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐవోసీఎల్ జనరల్ మేనేజర్ సుదీప్‌రాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.232కోట్లతో పోలీసులకు క్వార్టర్స్

రాష్ట్రవ్యాప్తంగా రూ.232కోట్లతో పోలీసు అధికారులు, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్మించిన ఏఆర్ డీఎస్పీ, సీఐ, ఎస్ఐ క్వార్టర్లను, శిశువిహార్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి.రమేష్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐజీ ఇక్బాల్, ఎస్పీ శరత్‌చంద్ర పవర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యల పాఠాలు

- అద్దె భవనాల్లో ఇక్కట్లు
- ప్రహరీలు లేక పాములు, తేళ్ల సంచారం

6

ప్రాణాలు నిలబెట్టే ప్రథమ చికిత్స

ప్రజల సౌకర్యం కోసం లోక్‌అదాలత్

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా 13 లోక్‌అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో 71 సివిల్ కేసులు, 15,921 క్రిమినల్, 96 మోటార్ వాహన ప్రమాద బీమా, 50 బ్యాంక్, 73 సైబర్ క్రైం, 35 ట్రాన్స్‌కో, 10,446 ట్రాఫిక్ చలాన కేసులు మొత్తం 26,692 కేసులను పరిష్కరించామన్నారు. అందులో ప్రమాదబీమా రూ.5.95కోట్లు, రూ.32,83,184లను బ్యాంకుల నుంచి పరిహారం ఇప్పించామన్నారు. సైబర్ క్రైం కేసుల్లో రికవరీ డబ్బులు రూ.4,51,245 ఇప్పించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి పురుషోత్తంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు శాపంలా సీపీఎస్

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దర్శన్‌గౌడ్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 29: సీపీఎస్ విధానం ఉద్యోగులకు శాపంలా మారిందని సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల దర్శన్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానికంగా జరిగిన పింఛన్ జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2004 అనంతరం రాష్ట్ర ప్రభుత్వ కొలువుల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పింఛన్ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాగవెల్లి ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు కొరివి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగ నర్సింహులు, భూలక్ష్మి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మనబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్



భిక్షం గౌడ్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటామని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై శనివారం నల్లగొండ పట్టణానికి వచ్చిన ఆయనకు పీఆర్టీయూ శ్రేణులు ఘనంగా స్వాగతంగా పలికాయి. పట్టణంలోని ఆయన నివాస గృహంలో ఉపాధ్యాయులు నిర్వహించిన ఆత్మీయ సన్మానంలో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్ల అవుతున్నా నేటికీ విద్యారంగం పలు సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. ప్రధానంగా ఏళ్లగా పేరుకు పోయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు వస్తాయని, దీంతో పాటు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు, ఇతర బిల్లులు మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి, నాయకులు బూరుగు లింగయ్య, వీరమల్ల శ్రీనివాస్, నాగయ్య, యాదయ్య, కృష్ణ, భద్రీనాద్, జిల్లాలోని పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.


మోత్కూరు బాలుర గురుకుల పాఠశాల



గురుకులాల్లో.. సమస్యల ..పాఠాలు

గురుకుల పాఠశాలల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. మొదటి నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న ఈ గురుకులాల్లో మౌలిక వసతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యాయి. కూర్చునేందుకు బెంచీలు లేక, నిద్రించేందుకు బెడ్‌లు లేక, సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు యాతన పడుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చాలా పాఠశాలల్లో పైకప్పుల పెచ్చులూడి పడుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోత్కూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు సొంత భవనం లేక, అరకొర వసతులతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. 2016లో ఇక్కడ గురుకుల పాఠశాల ప్రారంభమైంది. సొంత భవనం నిర్మించేందుకు మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు. తొమ్మిదేళ్లు గడిచినా సొంత భవన నిర్మాణ ఊసేలేదు. ఇక్కడ గురుకుల పాఠశాల నడిపేందుకు తొలుత ఒక అద్దె భవనాన్ని తీసుకోగా, అది సరిపోకపోవడంతో మరోచోట మరో భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. గురుకుల పాఠశాల 5, 6 తరగతులు ఒక చోట, ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు మరోచోట అద్దె భవనాల్లో నడుపుతున్నారు. దీంతో అజమాయిషీ చేయడానికి ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈకళాశాలలో గతంలో ఇంటర్ బైపీసీ గ్రూపు మాత్రమే ఉండగా, ఈ ఏడాది ఎంపీసీ కూడా ప్రారంభించారు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఒక అద్దె భవనానికి ఓ వైపు ప్రహరీ లేదు. ప్రహరీ నిర్మించాలని భవన యజమానికి చెప్పామని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

సొంత భవనాన్ని నిర్మించాలి

కొండగడపలో కేటాయించిన స్థలంలో గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించేందుకు కృషి చేయాలని ఈ నెల 11న కొండగడపకు వచ్చిన ఎమ్మెల్యే సామేలును విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఇంటర్ ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 19మంది, బైపీసీలో 24 మంది, ద్వితీయ సంవత్సరం బైపీసీలో 18 మంది విద్యార్థులున్నారు. ఒక్కో తరగతికి రెండు సెక్షన్ల చొప్పున ఇంటర్‌తో కలిసి మొత్తం 15 క్లాసులు నడుస్తున్నాయి. మొత్తం 460 మంది విద్యార్థులు ఉన్నారు. 20మంది రెగ్యులర్ టీచర్లు, 11 మంది పార్ట్‌టైం టీచర్లు ఉన్నారని, టీచింగ్ స్టాఫ్ కొరత లేదని, ఖాళీలు లేవని వైస్ ప్రిన్సిపాల్ వెంకటస్వామి తెలిపారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌లో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పాఠశాల/కళాశాలకు ఫర్నిచర్ కొరత ఉందని, విద్యార్థులు కూర్చోవడానికి డ్యూయల్‌డెస్క్ బెంచీలు లేవని, నిద్రించడానికి బెడ్‌లు లేవని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరుచేసి పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


ప్రహరీలేని కొమ్మెపల్లి గురుకుల పాఠశాల

పక్కా భవనాల్లో గురుకులాలు

కోదాడ: కోదాడ నియోజకవర్గంలోని బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ గురుకులాలు అద్దె (పక్కా) భవనాల్లో నడుస్తుండటంతో విద్యార్థులకు ఎలాంటి ముప్పు లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. భవనాలు ఇటీవలే నిర్మించటం, భవనాలు చుట్టూ ప్రహరీలు ఉండటం, శిథిలావస్థలో లేకపోవటంతో విద్యార్థులకు అన్నివిధాల భద్రత ఉన్నట్లు పేర్కొంటున్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు.

ప్రహరీలేక ఇబ్బందులు

దేవరకొండ: దేవరకొండ మండలం కొమ్మెపల్లి గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులున్నాయి. పాఠశాలలో 640 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తూ వసతి పొందుతున్నారు. గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడం, వర్షాలు కురుస్తుండడంతో పాములు, తేళ్లు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన గురుకుల పాఠశాల కొమ్మెపల్లి గ్రామశివారు చుట్టుపక్కల పొలాల మధ్యన ఉంది. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు రాత్రి, ఉదయంవేళలో బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నామని చెబుతున్నారు. ప్రహరీ నిర్మించాలని పాఠశాల నిర్వాహకులు జిల్లా కలెక్టర్‌కు, ప్రజాప్రతినిధులకు అనేక పర్యాయాలు విన్నవించారు. 2022నుంచి గిరిజన బాలుర గురుకుల పాఠశాల నడుస్తుంది. ప్రహరీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పాములు, తేళ్లు వస్తున్నాయి



వర్షాలు కురుస్తుండడం, గురుకుల పాఠశాల పొలాల మధ్య ఉండడంతో పాములు, తేళ్లు వస్తున్నాయి. దీంతో భయపడుతున్నాం. చుట్టూ ప్రహరీ నిర్మిస్తే రక్షణ ఉంటుంది. సమస్యను పరిష్కరించాలి.
హరీష్, 10వ తరగతి విద్యార్థి, కొమ్మెపల్లి


తలుపులు సరిగా లేని చెర్వుగట్టు గురుకుల పాఠశాల భవనం

గురుకులాలన్నీ అన్నీ అద్దె భవనాలే..

నార్కట్‌పల్లి: నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, నార్కట్‌పల్లి మండలాల్లో సాంఘిక, వెనుకబడిన తరగతుల వారి గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. చిన్ననారాయణపురం గ్రామశివారులో ఎస్సీ బాలికల వసతి గృహం, చెర్వుగట్టులో బాలుర, నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలున్నాయి. వీటితోపాటు నకిరేకల్‌లో బాలికల గురుకుల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సుమారు 300మంది విద్యార్థులున్న నకిరేకల్‌లోని మైనార్టీ బాల బాలికల గురుకుల పాఠశాల భవనంలో పైకప్పు పెచ్చులూడుతోందని గతంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించిన సమయంలో ఆమె దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె వెంటనే మరో భవనానికి మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను మార్చాలని సూచించారు. అయితే అనువైన భవనం లభించకపోవడంతో ప్రస్తుతానికి అదే భవనంలో తరగతులు కొనసాగిస్తున్నారు. ఇక నార్కట్‌పల్లిలోని చిన్ననారాయణపురం, చెర్వుగట్టు గ్రామాల శివార్లలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలు కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ రెండు భవనాల్లో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. చెర్వుగట్టు శివారులో ఉన్న గురుకుల పాఠశాల, కళాశాలలో సుమారు 500 మంది విద్యార్థులు నమోదయ్యారు. కానీ వీరికి సరిపడా మరుగుదొడ్లు లేవు. టాయ్‌లెట్ బ్లాక్‌లు 42, బాత్‌రూంలు కేవలం 10 మాత్రమే ఉండటంతో సరిపోక విద్యార్థులు తరగతులకు హాజరయ్యేందుకు ఆలస్యమవుతోంది. అదేవిధంగా డైనింగ్ హాల్ కూడా చిన్నగా ఉండటంతో ఒకేసారి విద్యార్థులు భోజనం చేయలేక పోతున్నారు. భవనం పైఅంతస్తులోని కొన్ని తరగతి గదులకు కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. డైనింగ్ హాల్‌ను విస్తరించాలని, అదేవిధంగా టాయ్‌లెట్ బ్లాక్‌లు, బాత్‌రూంల సంఖ్యను పెంచాలని భవన యజమానికి చెప్పామని ప్రిన్సిపాల్ బాలాజీ తెలిపారు.

బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీధర్


నియామకపత్రం అందుకుంటున్న శ్రీధర్

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా దూగుంట్ల శ్రీధర్ ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లోని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఆత్మకూర్(ఎస్) మండలం మిర్యాల గ్రామానికి చెందిన దూగుంట్ల శ్రీధర్ ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థలోని నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. త్వరలో 33 జిల్లాలో కమిటీలు ఏర్పాటుచేస్తామని తెలిపారు.

గోవుల వాహనం పట్టివేత



చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. రాజమండ్రి సంత నుంచి హైదరాబాద్ బహదూర్‌గూడ కబేళాకు 54 గోవులను డీసీఎంలో తరలిస్తుండగా మండల పరిధిలోని దండుమల్కాపురం శివారు ఆందోల్ మైసమ్మ దేవాలయ సమీపంలో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఇందులో 39ఆవులు, 19 ఎడ్లు ఉన్నాయి. డీసీఎం డ్రైవర్ నేనావత్ భాస్కర్, యజమాని నరేందర్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆవులను హైదరాబాద్ గోశాలకు తరలించినట్లు వివరించారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి


నల్లగొండలో త్రిపుల్‌ఆర్ నిర్వాసితులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

● త్రిపుల్‌ఆర్ నిర్వాసితుల డిమాండ్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ ధర ప్రకారం తమకు పరిహారం ఇవ్వాలని త్రిపుల్‌ఆర్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలవడానికి వచ్చిన త్రిపుల్‌ఆర్ బాధితులను అరెస్ట్ చేశారు. పట్టణంలోని ఇందిరాభవన్‌కు మంత్రి వచ్చిన విషయం తెలుసుకొని, నాంపల్లి, మర్రిగూడ మండలాలకు చెందిన నిర్వాసితులు అక్కడికి చేరుకున్నారు. దీంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా రైతులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులతో రైతులు వాగ్వాదానికి దిగారు. తమకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్‌చేశారు. అప్పటివరకు పనులను సాగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

రైతుల నుంచి ఆమోదం తీసుకోవాల్సిందే

మర్రిగూడ: త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఏర్పాటు కోసం తప్పనిసరిగా రైతుల ఆమోదం తీసుకోవాల్సిందేనని టీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డును టీడీపీ స్వాగతిస్తుంది గానీ, అలైన్‌మెంట్‌కోసం రైతుల నుంచి ఆమోదం తీసుకోకపోవడం సరికాదన్నారు. ప్రజలు, రైతులకు అనుకూలంగా ఉండే విధంగా రీజినల్ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకన్న, పుప్పాల యాదయ్య, శ్రీరాములు కాసర్ల అంజయ్య అన్నారు.

సాగర్ ఎడమకాల్వలో ఒకరి గల్లంతు


గల్లంతైన శ్రీను

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు సాగర్ ఎడమకాల్వలో కొట్టుకుపోయి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల వద్ద ఈ ఘటన జరిగింది. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుంకిశాలతండాకు చెందిన కెలావత్ శ్రీను పెద్దవూర మండలంలోని పొట్టివానితండాలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే సమీపంలోని పొలానికి చెందిన రమావత్ దత్తు కుమార్తె అంజలికి ఇటీవల ఆరోగ్యం బాగోలేకపోవడంతో శుక్రవారం అల్వాల వద్ద గల దర్గాకు తీసుకొచ్చాడు. దర్శనం అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అంజలి సమీపంలో ఉన్న సాగర్ ఎడమకాల్వలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి ప్రవాహంలో కొట్టుకుపోతుంది. దీన్ని గమనించిన శ్రీను వెంటనే నీటిలో దూకి కొట్టుకుపోతున్న అంజలిని ఒడ్డుకు చేర్చే క్రమంలో ప్రవాహానికి నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఈ క్రమంలో తండాకు చెందిన బంధువులు, పోలీసులు వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో గల్లంతైన వ్యక్తి భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

త్రిపురారం: కుటుంబ తగాదాలతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతదేహం శనివారం లభ్యమైంది. ఎస్ఐ కైగూరి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన సకినాల రాధమ్మ, భర్త రాధాకృష్ణల మధ్య కుటుంబ, ఆర్థిక వ్యవహారాల విషయంలో గొడవలు జరుగుతు న్నాయి. ఈ క్రమంలో వారిద్దరూ ఈ నెల 10న ఉదయం ఇంట్లో గొడవపడ్డారు. అనంతరం భర్త ఇంట్లో నుంచి వెళ్లిపోయిన తర్వాత రాధమ్మ కంపసాగర్ గ్రామ శివారులోగల ఎడమ కాల్వకు చేరుకొని, అందులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే తన భార్య రాధమ్మ ఆచూకీ తెలవకపోవడంతో రాధాకృష్ణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శనివారం ఉదయం రాధమ్మ మృతదేహం కంపసాగర్ చిన్న చెరువులో లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాధాకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

16 నుంచి కళాశాలలు బంద్

(5వపేజీ తరువాయి)

రూ.100కోట్లు ఉండగా, బిల్లు చేయని మొత్తం రూ.150కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

కళాశాలల నిర్వహణకు డబ్బు లేక

ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు ఎక్కువగా అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తున్నందున విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయకూడదు. అయితే ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో భవనాల అద్దె, సిబ్బంది వేతనాలు చెల్లించలేకపోతున్నామని కళాశాలల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అప్పు చేసి కొంత కాలం అద్దె, సిబ్బంది వేతనాలు చెల్లించామని, ఇక అప్పు కూడా దొరికే పరిస్థితి లేదంటున్నారు. గత ఏప్రిల్, మే మాసాల్లో పరీక్షలు బహిష్కరించి 40 రోజులు సమ్మె నిర్వహించగా, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి యాజమాన్యాలను సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వద్దకు తీసుకెళ్లారు. ప్రభుత్వం మూడు రోజుల్లో కొంత బకాయి చెల్లిస్తుందని ఆయన హామీ ఇవ్వగా, అది నేటికీ అమలుకాలేదు. పరీక్షలు నిర్వహించకుంటే విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందనే మానవతా దృక్పథంతో నాడు సమ్మె విరమిస్తే, నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుంటే ఎలా అని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, లేదంటే ఈ నెల 16 నుంచి కళాశాలలు మూసి నిరవధిక బంద్ పాటిస్తామన్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో ఇబ్బందులు ఎదురవుతాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

దసరాకు 705 బస్సులు

(5వపేజీ తరువాయి)

మిర్యాలగూడ డిపో పరిధిలో 115, నల్లగొండ డిపో పరిధిలో 89, నార్కట్‌పల్లి డిపో పరిధి లో 36, సూర్యాపేట పరిధిలో 144, యాదగిరిగుట్ట పరిధిలో 96 బస్ సర్వీసులను మొత్తంగా పండుగ రోజుల్లో దసరా స్పెషల్‌గా 705 బస్ సర్వీసులను ఆయా రూట్లల్లో తిప్పనున్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా ప్రతీ రూట్‌లోనూ అవసరమైన మేరకు బస్సులు నడపనున్నారు. అత్యధికంగా నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి జిల్లాలోని ఆయా డిపోల నుంచి హైదరాబాద్ నగరానికి బస్సులు అధిక సంఖ్యలో నడపనున్నారు.

మెరుగైన ప్రయాణమే లక్ష్యం

దసరా పండుగ సందర్భంగా రీజియన్ పరిధిలో ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనుంది. మొత్తం 705 స్పెషల్ బస్సు సర్వీసులు ఈనెల 20 నుంచి నడుస్తాయి. ప్రయాణికులకు మెరుగైన ప్రయాణమే లక్ష్యంగా వీటిని నడుపుతాం.
కె.జానిరెడ్డి, నల్లగొండ ఆర్టీసీ ఆర్ఎం

ప్రాణాలు నిలబెట్టే ప్రథమ చికిత్స

» అవగాహన ఉండాలంటున్న వైద్యనిపుణులు
» సీపీఆర్ గురించి తెలిసింది తక్కువే

వేములపల్లి మండలంలో ఓ రైతు విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. స్థానికులు 108 వాహనానికి కాల్ చేశారు. బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తూనే వాహన సిబ్బంది సీపీఆర్ చేశారు. దీంతో బాధితుడు స్పృహలోకి రావడం, సకాలంలో చికిత్స పొందడంతో ప్రమాదం తప్పింది. సమయస్ఫూర్తి ప్రదర్శించిన 108 వాహన సిబ్బందిని పలువురు అభినందించారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకలకు హాజరైన ప్రభుత్వ ఇంజనీర్ కార్డియాక్ అరెస్ట్ అయ్యారు. అదే వేదికపై ఉన్న వైద్య శాఖాధికారి తక్షణమే స్పందించి సీపీఆర్ చేసి ప్రాణాపాయం లేకుండా కాపాడారు.

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

ప్రథమ చికిత్స అంటే.. వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఏ వ్యక్తినైనా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడటం, ఆరోగ్య పరిస్థితి మరింతగా దిగజారకుండా చూడటం. క్లుప్తంగా చెప్పాలంటే సదరు వ్యక్తి అత్యవసర వైద్యపరిస్థితి నుంచి కోలుకోవడానికి సాయమందించడం. అయితే ప్రథమ చికిత్సపై అవగాహన లేకపోవడంతో పెద్దసంఖ్యలో ప్రాణనష్టం జరుగుతోంది. దేశంలో ప్రతిఏటా లక్షన్నర మంది ప్రథమచికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇదిలా ఉండగా ప్రథమ చికిత్సతో ప్రాణాలు నిలబెట్టుకున్న వారి సంఖ్య అతిస్వల్పంగా ఉంటోంది.

పల్లెలే ముందంజలో...

ప్రథమ చికిత్సలో పట్టణాలతో పోలిస్తే పల్లెలే ముందుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గాయపడిన/ప్రమాదానికి గురైన పిల్లలలో 72శాతం మందికి ప్రథమ చికిత్స అందుతుండగా, పట్టణాల్లో 67శాతంమాత్రమే నమోదవడం గమనార్హం. పాము, తేలుకాటు ఘటనల్లో పల్లెల్లో మెరుగైన ప్రథమ చికిత్స అందుతోంది. ఇంటి పనులు, వంటింటి పనులు చేసే మహిళలు ప్రమాదాలకు గురైనపుడు పల్లెలతో పాటు పట్టణాల్లోనూ ప్రథమచికిత్స సమానంగా ఉన్నాయి.

బాక్సు చిన్నదే.. పని గొప్పది

ఫస్ట్ ఎయిడ్ బాక్స్. చిన్నదే అయినా పనిగొప్పది. ఆపదలో ఉన్న వారికి అత్యవసర చికిత్సకు అవసరమైన సామాగ్రి ఉండే పెట్టె. సానిటైజర్, గ్లౌజులు, దూదీ, అయోడిన్, కట్టుదారం, టేపు, కత్తెర, క్రిమిసంహారక మందులు, యాంటిబయోటిక్స్ కోల్డ్ ప్యాక్స్ అందులో ఉంటాయి.

ఎవరైనా చేయొచ్చు

శిక్షణ తీసుకున్న వారే ప్రథమ చికిత్స అందించాలనేమీ లేదు. ఎవరైనా సరే ప్రమాదానికి గురైన వ్యక్తి ప్రాణాలు కాపాడటం, క్షీణతను నివారించడం, రికవరీని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టవచ్చని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.


సీపీఆర్ విధానాన్ని నిపుణుల సమక్షంలో చేసి చూపిస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ భార్గవ్ (ఫైల్)

సీపీఆర్‌దే ప్రథమ స్థానం..

ప్రథమ చికిత్సల్లో ప్రథమ స్థానం సీపీఆర్(కార్డియో పల్మనరీ రెసెక్యుటేషన్)దే. ఇది గుండె కొట్టుకోవడం ఆగిపోయినా, శ్వాస ఆగిపోయిన తరుణంలో చేసే అత్యవసర ప్రథమ చికిత్స. పడిపోయిన వ్యక్తి ఛాతిని బలంగా, వేగంగా(ఓ క్రమపద్ధతిలో సుమా) వొత్తడం. ఏవ్యక్తి అయినా చనిపోయేది గుండె కొట్టుకోవడం ఆగితేనే కదా. సదరు వ్యక్తి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నా, అతడికి ఎలాంటి వ్యాధులున్నా, హార్ట్‌బీట్ ఆగితేనే అతను మరణిస్తాడు. అయితే వెనువెంటనే సీపీఆర్‌అందిస్తే గుండె కొట్టుకోవడం ప్రారంభమవుతుంది.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

గతంలో ఇలా..

గతంలో ప్రతీ వాహనంలో ఫస్ట్‌ఎయిడ్ కిట్ ఉండేది. వాహనతయారీ, విక్రయసంస్థలు తప్పనిసరిగా ప్రథమచికిత్స పెట్టెను ఉంచేవారు. బైక్‌లలో సీట్ల కింద ప్లగ్ పానా, వీల్ పానాలతో కూడిన కిట్లతో పాటు ఫస్ట్ ఎయిడ్ బ్యాగ్‌ను ఉంచేవారు. కార్లలో డ్యాష్ బోర్డులో ఓనర్స్ మ్యాన్యువల్‌తో పాటు ఫస్ట్‌ఎయిడ్ కిట్‌ను ఉంచడం తప్పనిసరి. ఇక డీసీఎం, లారీలు, బస్సులలో ఎదురుగా కనపడేలా ప్లస్ సింబల్‌తో కిట్ ఉండేది. అయితే కాలక్రమేణా ఆయా కిట్లను తయారీ సంస్థలు తొలగిస్తుండగా, వినియోగదారులు సైతం ఆ ఊసే ఎత్తడంలేదు.

గుడ్ సామరిటన్ ప్రోత్సాహకాలు..

ప్రథమ చికిత్సలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'గుడ్ సామరిటన్' పథకంతో ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు 2016 మార్చి 30న ఆమోదించగా, 2019లో మోటారు వాహన చట్టంలో చేర్చారు. దీని ద్వారా రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారి ప్రాణాలను ప్రథమచికిత్స చేసి కాపాడిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తారు. అదే విధంగా అలాంటి వ్యక్తులపై న్యాయ, చట్టపరమైన చర్యలకు ఉపక్రమించొద్దని పేర్కొంది.

ప్రాథమిక ట్రామా లైఫ్ సపోర్ట్‌తో శిక్షణ


ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణసాయం అందించేందుకు వాలంటీర్లు, పోలీసు దళ సభ్యులకు ప్రాథమిక ట్రా మా లైఫ్ సపోర్ట్(పీటీఎల్ఎస్) పేరుతో శిక్షణనిస్తున్నారు. జనాభాలో సుమారు 80శాతం మందికి సమర్థవంతమైన ఎమర్జెన్సీ పరిజ్ఞానంలో సరైన నైపుణ్యం లేదని పలుపరిశోధనలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రాథమిక ట్రామా లైఫ్ సపో ర్ట్ పేరుతో కేంద్రప్రభుత్వం శిక్షణ ఇస్తోంది.

భయాందోళన అవసరం లేదు




ప్రమాదాల్లో గాయపడిన వారికి సాయం చేయడంతో భయాందోళన చెందాల్సిన అవస రంలేదు.ప్రమాదానికి గురైన వ్యక్తులకు ప్రథమ చికిత్స అందించి, సమీపంలోని ఆస్పత్రికి తరలించాలి.ఆస్పత్రిలో చేర్పించిన వారిని పో లీస్, వైద్యశాఖలు ఎటువంటి ఇబ్బందులకు గురిచేయవు. అలాంటి వ్యక్తులను గౌరవించి, అభినందిస్తాం. సందేహాలు వీడి ప్రథమ చికి త్స చేసేందుకు అందరూ ముందుకురావాలి.
- రాజశేఖరరాజు, డీఎస్పీ, మిర్యాలగూడ.

ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించడమే



ప్రథమ చికిత్స అంటే ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించడమే. ఫస్ట్‌ఎయిడ్ తీవ్ర అస్వస్థతలో ఉన్న వారిని బతికిస్తుంది, స్వల్పంగా గాయపడిన వారిని చికిత్స తీవ్రతను తగ్గిస్తుంది. ఇటీవల ప్రథమ చికిత్సపై అవగాహన పెరగడం ఆహ్వానించదగిన పరిణామం. సామాజిక మాధ్యమాల వినియోగంతో ప్రథమ చికిత్స అందించడం గురించి తెలుసుకోవడం సులభమైంది. ప్రథమచికిత్స, సీపీఆర్‌పై చర్చతోపాటు ప్రచారం జరగాల్సి ఉంది.
- డాక్టర్ జాడి రాజు



పొంచి ఉన్న ప్రమాదం




జాతీయ రహదారిపై పడిన రంధ్రాలు

జాతీయ రహదారిపై రంధ్రం పడింది. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి మండలంలోని బాహుపేట-వంగపల్లి మధ్యలో బిక్కేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జిపై మీటర్ వెడల్పు, రెండు ఫీట్ల లోతువరకు రంధ్రం పడింది. నిత్యం వేలాది వాహనాలు ఆ రోడ్డు నుంచి ప్రయాణిస్తున్నప్పటికీ 20 రోజుల నుంచి ఎన్‌హెచ్ఏఐ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రంధ్రంపడిన చోట కనీసం ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో ద్విచక్రవాహనాలపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

ఎండకు ఎండి.. వానకు తడిసి



జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ తొలగించడంతో ఇబ్బందులు పడుతున్న భక్తులు



షెడ్డు తొలగించకముందు(ఫైల్)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించేందుకు తరలివచ్చే భక్తులకోసం బిగించిన భారీ షెడ్డును ఆలయ అధికారులు తొలగించారు. కొండపైన ఉత్తర తిరువీధిలో ఈ నెల 8వ తేదీన ఎండ, వానల నుంచి భక్తులకు రక్షణగా జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ షెడ్డును తొలగించారు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఎండా, వానల నుంచి తలదాచుకునేందుకు చోటు లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

నాలుగు నెలలాయె..! జీతంరాక

● ఇబ్బందులు పడుతున్న గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు





విధులు నిర్వర్తిస్తున్న మల్టీపర్పస్ వర్కర్

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాలు అందక గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు పస్తులుంటూనే పనులు చేస్తున్నారు. పండుగ వరకైనా జీతాలు ఇప్పించి తమ కుటుంబాల్లో ఆనందం నింపాలని కోరుతున్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు. వారికి నాలుగునెలలుగా జీతాలురాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విరామం లేకుండా గ్రామంలో 24 గంటలు పనులు చేస్తున్నా మూడు, నాలుగు నెలలకోసారి జీతాలు ఇస్తే కుటుంబాలు ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పరిశుభ్రత, తాగు నీరు, వీధి దీపాలు ఇలా అన్ని పనులు చూసుకునే మమ్మల్ని ఆదుకునే వారు లేరా అని ప్రశ్నించారు.

నాలుగు నెలలుగా జీతాలు లేవు



మేము నిరంతరం గ్రామంకోసం పనిచేస్తున్నాం. నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. పండుగ వరకైనా జీతాలు ఇచ్చి మా కుటుంబాలను ఆదుకోవాలి.

ఐక్కయ్య, మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు

రాగానే వేతనాలు ఇస్తాం



రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ బడ్జెట్ ద్వారా మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు అందిస్తుంది. వీరి వేతనాలు నేరుగా గ్రామపంచాయతీ ఖాతాలోకి వస్తాయి. అవి రాగానే అందిస్తాం.

భీంసింగ్, ఎంపీవో తిరుమలగిరి.

లచ్చిరాం నాయక్‌కు పర్యావరణ సారథి పురస్కారం

మర్రిగూడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ ఉదావత్ లచ్చిరాం నాయక్ పర్యావరణ సారథి పురస్కారాన్ని ఆన్‌లైన్ ద్వారా అందుకున్నారు. మండలంలోని దామర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ లచ్చిరాం నాయక్, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేయడం, ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ అవార్డుకు పారాచూట్ వరల్డ్ రికార్డు ఇండియా సంస్థ ఎంపికచేసింది. శనివారం పారాచూట్ వరల్డ్ రికార్డ్ ఇండియా చీఫ్ దాసరి స్వప్న మహేష్ ద్వారా ఆన్‌లైన్‌లో అవార్డు అందుకున్నారు.

పాఠశాలకు బెంచీల అందజేత



బెంచీలతో పలివెల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

మునుగోడు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలకు రూ. 7లక్షల వ్యయంతో విద్యార్థులకు సరిపడా 110 బెంచీలను ప్రత్యేకంగా తయారు చేయించి పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ప్రధానోపాధ్యాయుడు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



అమ్మ పేరుతో మొక్క

● ప్రతీ విద్యార్థి ఓ మొక్క నాటేలా విద్యాశాఖ ప్రణాళిక
● ఒకే రోజున జిల్లాలో లక్ష మొక్కలు నాటే అవకాశం

ప్రేమను పంచడం, బాధ్యతలు వహించడంలో అమ్మ.. చెట్టు.. ఒకటేనని ఓ నానుడి. పిల్లల జననం నుంచి వారి ఉజ్వల భవిష్యత్ కోసం ప్రతీ తల్లి తన జీవితాన్ని, శక్తిసామర్థ్యాలను ధారపోస్తుంది. అలాగే ఓ మొక్కను నాటి సంరక్షించగలిగితే చెట్టుగా ఎదిగి తన పంచన చేరే అందరికీ నీడ, గాలి, పండ్లు, ఔషధాలు, పూలు చివరికి సుహాసనలను కూడా ఎలాంటి కల్మషం లేకుండా పంచుతుంది.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

కేంద్ర ప్రభుత్వం ప్రతీ విద్యార్థితో ఓ మొక్కను నాటించి సంరక్షించే లక్ష్యంతో అమ్మ పేరు మీదీ ఒక చెట్టు (మాకా నామ్ పే ఏక్ పేడ్) పథకాన్ని సంకల్పించింది. ఈ మేరకు ఆదివారం (ఈనెల 14వ తేదీ) దేశవ్యాప్తంగా ఉదయం 9 లేదా 11 గంటలకు (రెండింటిలో వీలైన సమయంలో) విద్యార్థులందరూ తమ అమ్మలతో కలిసి మొక్కలను నాటాలని నిర్దేశించింది. ఇల్లు, బడి, గుడి లేదా ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కను నాటి సంరక్షిస్తామని సంకల్పం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈమేరకు జిల్లా విద్యాశాఖ పథకం అమలును పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న ప్రతీ విద్యార్థి తల్లితో కలిసి మొక్కను నాటి సెల్ఫీ లేదా కుటుంబ సభ్యులందరూ ఫొటో దిగి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఫోన్‌కు వాట్సప్ పంపాలని అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థులు పంపిన ఫొటోలు, వారి వివరాలను ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇంటర్ కళాశాలల విద్యార్థులు కూడా మొక్కలు నాటాల్సి ఉంటుంది. పథకంలో అందరూ భాగస్వాములైతే ఒకేరోజు జిల్లావ్యాప్తంగా సుమారు లక్ష వరకు మొక్కలు నాటే అవకాశం ఉంది. దీంతో భవిష్యత్‌లో జిల్లాలో పర్యావరణ సమతుల్యం పెరిగే అవకాశం ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు.

అందుబాటులో నర్సరీ మొక్కలు

అమ్మతో కలిసి విద్యార్థి నాటే మొక్కలు స్థానిక నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయని అటవీ, విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ముందు రోజే మొక్కలను పాఠశాలలో సిద్ధంగా ఉంచాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు కూడా విద్యార్థులపై శ్రద్ధచూపి ప్రోత్సహించాలని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ తరగతిని క్లాస్ టీచర్ పర్యవేక్షణ చేసి ప్రతీ విద్యార్థి మొక్కనాటేలా చొరవ చూపాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. అలాగే విద్యార్థులు పంపిన ఫొటోలను ఆదివారం రాత్రిలోపు అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులకు నిర్దేశించారు.

ప్రతీ విద్యార్థి అమ్మతో కలిసి మొక్క నాటాలి



జిల్లాలోని 6 నుంచి 12వ తరగతి వరకు ప్రతీ విద్యార్థి అమ్మతో కలిసి ఆదివారం మొక్క నాటి సంరక్షణకు సంకల్పం తీసుకోవాలి. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు వార్డెన్, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటాలి. ఇందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ యాజమాన్యాలు బాధ్యత వహించాలి. అలసత్వం చూపితే చర్యలు తప్పవు.

కే.సత్యనారాయణ, డీఈవో, యాదాద్రి భువనగిరి

ముగ్గురికి 14రోజుల రిమాండ్

అడ్డగూడూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా, అడ్డగూడూరు మండలంలోని వెల్దేవి గ్రామానికి చెందిన ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వెల్దేవి గ్రామానికి చెందిన ఊడుగు జయమ్మకు తన తల్లి గారి గ్రామమైన ఆజీంపేటలో సొంత ఇల్లు ఉంది. ఆ ఇల్లు తన సొంత అవసరాల కోసం విక్రయించింది. ఆ ఇల్లు అమ్మిన విషయంలో తన సొంత తమ్ముడైన ఆజీంపేట గ్రామానికి చెందిన ఇటికాల పరుశురాములు కొద్ది రోజులుగా గొడువపడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం జయమ్మ తన కూమారుడు స్వామితో కలిసి తన తల్లిని చూడటానికి ఆజీంపేటకు వెళ్లింది. తన తల్లి ఇంట్లో లేనందున తన తమ్ముడు పరుశురాములు ఇంటికి వెళ్లింది. ఆమెతో తమ్ముడు గొడవ పడడటంతో అక్కడే ఉన్న తన బాబాయి ఇటికాల కూమార్ జయమ్మను కొట్టాడు. అడ్డుకోబోయిన తన కూమారుడు స్వామిపై పరశురాములు, ఇటికాల శ్రీనుతో కలిసి దాడిచేశారు. తన కుమారుడిని కొట్టవద్దని అడ్డుకోబోయిన జయమ్మతో ఆ ముగ్గురు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారని, దీంతో తన కుమారుడు స్వామి 100కాల్ చేయగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై బాధితురాలు ఉడుగు జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించి ముగ్గురు వ్యక్తులను కోర్టులో హాజరు పరచామని, వారికి 14రోజులు రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు.

సమాజ నిర్మాణం గురువులదే: డీఈవో

రాజాపేట,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో కూడిన చదువును బోధించి సమాజ నిర్మాణం గురువులపైనే ఉంటుందని డీఈవో కందుల సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా ఆయన సన్మానించి మాట్లాడారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



యాదగిరిగుట్టలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,83,713ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, ప్రతీ వారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా కేఏఎస్ మ్యూజిక్ అకాడమీ (హైదరాబాద్) భక్తి సంగీతం నిర్వహించగా స్వామివారిని దర్శించుకునేందుకు వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ బి. రవీంద్రనాయక్ యాదగిరిగుట్టకు వచ్చారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పండితులు వేదాశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాలను అందజేశారు.

కణ్ణన్ తిరునక్షత్రోత్సవాలు రేపు

యాదగిరిగుట్ట, పాతగుట్ట ఉభయ ఆలయాల్లో కణ్ణన్ తిరునక్షత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. ఈ నెల 15న ఉదయం కణ్ణన్ పెరుమాళ్లు, ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం నిర్వహించి అద్దాల మండపంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిపి నివేదించి నవకలశ స్నపనం, విశేష తిరుమంజన సేవ, 17న(బుధవారం) సాయంత్రం ఉట్లోత్సవం (శిఖ్యోత్సవం) అనంతరం ఆలయంలో రుక్మిణీ కల్యాణోత్సవంనిర్వహించనున్నారు. ఈ వేడుకల సందర్భంగా నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు, సుదర్శన నారసింహ హోమం, వివిధ భోగాలు (15న మాత్రమే) రద్దు పర్చినట్లు ఈవో తెలిపారు.

మఠంపల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహామూర్తి, ఆంజనేయచార్యులు పాల్గొన్నారు.



మట్టపల్లిలోతాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

హామీలను నెరవేర్చాలి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన రెగ్యులరైజేషన్ హామీని నెరవేర్చాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ , బొమ్మగోని రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సమగ్రశిక్ష ఉద్యోగులు శనివారం సీఎం ప్రామిస్ డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా రాష్ట్రంలోని విద్యారంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. విధుల్లో ఉండి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటకృష్ణ, బంటు వెంకటేశ్వర్లు, మంగ నిరంజన్, బొమ్మరాగోని సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకుడు, సోషల్ వర్కర్ దీరావత్ హన్యానాయక్‌కు అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం దక్కింది. బ్యాంకాక్‌కు చెందిన పౌల్ నరులా సంస్థ, దుబాయ్‌కి చెందిన జినసిస్ ఆల్టిమా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జీ స్క్వైర్ యూనివర్సల్ సహకారంతో థాయ్‌లాండ్‌లో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ సెమినార్‌కు హన్యానాయక్ హాజరయ్యారు. ప్రపంచంలోని ఎనిమిది దేశాలకు చెందిన వారికి ఆహ్వానం అందగా, సోషల్ సర్వీస్ విభాగంలో హన్యానాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అత్యంత ప్రతిష్ఠాత్మక సదస్సుకు ఆహ్వానం అందడం ఆనందంగా ఉందన్నారు.

అంధుడైతేనేమీ.. అదుర్స్

● చదరంగం పోటీల్లో అంధ విద్యార్థి ప్రతిభ ● వివిధ స్థాయిల్లో బంగారు పతకాలు సాధించిన నితిన్ ● ప్రభుత్వ సహాయాన్ని కోరుతున్న అంధ విద్యార్థి

సమాజంలో అంధులు ఎన్నో విజయాలు సాధించి తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. పుట్టుకతోనే అంధులైన ఎంతోమంది తమ ప్రతిభా పాటవాలతో సమాజం మనస్సును గెలుస్తున్నారు. అలాంటి కోవలోకే వస్తారు ఆనబత్తుల నితిన్.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)



మాజీ రాష్ట్రపతితో ఆనబత్తుల నితిన్(సర్కిల్‌లో)



సాధించిన పతకాలతో నితిన్

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురానికి చెందిన ఆనబత్తుల కృష్ణ, శోభల పెద్దకుమారుడు నితిన్ అంధత్వం ఉన్నా చదరంగం, షార్ట్‌పుట్ పోటీల్లో తన ప్రతిభను చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో వివిధ హోదాల్లో బంగారు పతకాలు సాధించారు. అంధ విద్యార్థి అయిన నితిన్ ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేస్తున్నారు. కాగా ఎన్‌సీసీలో పాల్గొని అనేక చోట్ల పరేడ్ నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు నల్లగొండలోని అంధుల పాఠశాలలో చదువుకున్న నితిన్ ఇంటర్, డిగ్రీ శంషాబాద్ నేత్రాలయ అంధుల పాఠశాలలో విద్యనభ్యసించారు.

జాతీయస్థాయి చెస్ పోటీల్లో..

నితిన్ గత మూడున్నరేళ్లుగా ఢిల్లీ, పూణె, మహారాష్ట్ర, వార్ధా, బెంగళూరులలో జరిగిన జాతీయ స్థాయి చదరంగం పోటీల్లో వివిధ స్థాయిల్లో బంగారు పతకాలు సాధించి తన ప్రతిభా పాఠవాన్ని ప్రదర్శించారు. 2023లో గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించగా, 2024లో ఢిల్లీలో జాతీయస్థాయిలో జరిగిన పోటీల్లో ఐదో స్థానం సాధించారు. పూణెలో జరిగిన పోటీల్లోనూ తృతీయ స్థానం సాధించారు. ఢిల్లీలో జరిగిన పోటీల్లోనూ డిస్కస్‌త్రోలోనూ బంగారు పతకం సాధించారు. హైదరాబాద్ సౌత్ రీజన్‌స్థాయిలో జరిగిన షార్ట్‌పుట్ పోటీల్లో నితిన్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఇదిలా ఉండగా నల్లగొండలోని అంధుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సమయంలో చిల్డ్రన్స్‌డే సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌ను కలిశారు.

ఉపాధి కోసం ప్రయత్నాలు

షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, చదరంగం పోటీల్లో మూడు విభాగాల్లోనూ బంగారు పతకాలు సాధించిన నితిన్ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అనేక పోటీ పరీక్షలు రాయగా, తృటిలో ఉద్యోగం తప్పిందని నితిన్ పేర్కొన్నారు. ప్రభుత్వం సహకరిస్తే ఆయా పోటీల్లో అద్భుతాలు సాధిస్తానని నితిన్ పేర్కొంటున్నారు.

ప్రభుత్వం సహకరించాలి

ప్రభుత్వం సహకరిస్తే చదరంగం, షార్ట్‌పుట్, డిస్కస్ త్రోలో అద్భుతాలు సాధిస్తా. ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగళూరు, హైదరాబాద్‌లలో నిర్వహించిన జాతీయస్థాయి చదరంగం పోటీల్లో వివిధ విభాగాల్లో గోల్డ్‌మెడల్ సాధించా. ఇటీవల నిర్వహించిన అనేక పోటీ పరీక్షలు రాశాను. రెండుమూడు మార్కుల తేడాలో ఉద్యోగం కోల్పోయా. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని విజయాలు సాధిస్తా.

ఆనబత్తుల నితిన్, గోవిందాపురం

ఆర్థిక సాయం అందజేత

మునుగోడురూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోతులారం గ్రామానికి చెందిన ఏపూరి ఎల్లమ్మ రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్టి కోటేశ్వర్ ఆమె కుటుంబ సభ్యులకు రూ.5వేలు, క్వింటా బియ్యం అందజేశారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జాల జంగయ్య రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, కొండూరి నరసింహ, జాజుల మల్లేష్, గండయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్ట్ చేయడం హేయం : రైతు సంఘం

గట్టుప్పల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులను ముందస్తు అరెస్టు చేయడం సరైన విధానం కాదని, హేయమని రైతు సంఘం జిల్లా నాయకుడు చాపల మారయ్య అన్నారు. భూములు, ఇళ్లు నష్టపోయిన రైతులకు మద్దతుగా వామపక్షాల దర్నా నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున వామపక్ష నాయకులను అరెస్టు చేయడం మంచిది కాదన్నారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్, నాయకులు సత్తిరెడ్డి, శేఖర్‌రెడ్డి, అంజయ్య, మారయ్య, వెంకన్న, అల్వాల్‌రెడ్డి ఉన్నారు.

విశ్వాసానికి ప్రతీకగా








కుక్కల దత్తత, స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ రాంనగర్ పార్కులో శునకాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పలు జాతులకు చెందిన శునకాలు ఆకట్టుకున్నాయి.

యూరియా కోసం అదే 'వరుస'

● రైతులకు తప్పని ఇబ్బందులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కష్టాలు ఇంకా తీరడం లేదు. అదును రోజులు దగ్గరపడుతున్నా యూరియా మాత్రం కావాల్సినంత దొరకడం లేదు. దీంతో రైతులకు యూరియా తిప్పలు అదే వరుసగా మారాయి. నార్కట్‌పల్లి పీఏసీఎస్‌కు శనివారం 444 బస్తాల యూరియా వచ్చింది. యూరియా వచ్చిందని తెలిసిన వెంటనే రైతులు తెల్లవారుజామునుంచే వచ్చి యూరియా కోసం బారులు దీరారు. పోలీసులు, ఏఈవోలు క్యూ లైన్ల వారీగా రైతుల పేర్లు రాశారు. ఏవో గౌతమ్, ఏఈవో శిరీష మైక్ అనౌన్స్‌మెంట్ చేస్తూ వారికి రశీదులు అందజేశారు. అయినా వచ్చిన రైతులందరికీ యూరియా దొరకలేదు. దీంతో తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేశారు.



నాంపల్లిలో యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

యూరియా కోసం రైతుల అవస్థలు

నాంపల్లి: నాంపల్లి మండలకేంద్రంలో యూరియా కోసం రైతు సేవా కేంద్రం వద్ద రైతులు బారులుతీరారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా యూరియా కోసం రైతులు ముందుగానే టోకెన్లు తీసుకొని లైన్‌లో నిలబడే పరిస్థితి ఏర్పడింది. గంటల తరబడి గ్రామాల నుంచి వచ్చిన రైతులు యూరియా కోసం పడిగాపులుగాస్తున్నారు. కొంత మందికే యూరియా అందజేసి స్టాక్ అయిపోయిందని నిర్వాహకులు, అధికారులు తెలియజేయడంతో రైతులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.


నార్కట్‌పల్లిలో యూరియా కోసం క్యూలైన్‌లో పాస్ పుస్తకాలు పెట్టిన రైతులు

సోమవా రం యూరియా స్టాక్ వస్తుందని రైతులందరికీ అందిస్తామని అధికారులు పేర్కొన్నారు.

శాలిగౌరారం: యూరియా కోసం రైతుల బాధలు తప్పడం లేదు. నాలుగు రోజుల నుంచి యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. శనివారం తెల్లవారుజామున శాలిగౌరారం రైతు వేదిక వద్దకు 444 బస్తాల యూరియా లోడ్ వచ్చింది. శనివారం తెల్లవారుజాము నుంచే రైతులు అధిక సంఖ్యలో బారులు తీశారు. ఏవో సౌమ్యశృతి తన సిబ్బందితో టోకెన్ ద్వారా రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం


వేణుగోపాలస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి దే వస్థానంలో శనివారం మాస కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అ నువంశిక అర్చకుడు కారంపూడి కృష్ణమాచార్యులు, వేణాచార్యుల యాజ్ఞీకంలో భక్తుల గోవింద నామస్మరణల మధ్య రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి కల్యాణ వేడుక ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. పెళ్లి వేడుకపై ఇడుకుళ్ల బిక్షమయ్య, గంధం భాస్కర్, అన్నప్రసాద దాత రూపని పాండు దంపతులు కూర్చున్నారు. ఈ ఉత్సవంలో దేవస్థానం చైర్మన్ దోసపాటి ప్రసాద్, సామ కొండల్‌రెడ్డి, అయితరాజు రమేశ్, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, గంధం భాస్కర్, దోసపాటి విష్ణు, రఘు, వేణు, కోటయ్య, బండారు రమేశ్, శ్రీనివాస్, రవీందర్, రాములు, శేఖర్, కృష్ణయ్య, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానం రద్దుచేయాలి

మర్రిగూడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేసి, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల 6వ మహాసభ జరిగింది. సీఐటీయూ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామదాసు శ్రీనివాస్ నాయక్, కార్యదర్శిగా నరసింహ, ఉపాధ్యక్షులుగా మంజుల, అమృత వీరితోపాటు మరో 18 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో చేతివృత్తుల సంఘం అధ్యక్షులు తల్లోజు రామలింగచారి, మాడుగుల శీను, పాత పద్మ, సుజాత, లింగయ్య, రమణమ్మ, అలివేలు పలువురు ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

● ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, సెప్టెంబర్ 13, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సింది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లో కమల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో జరిగిన ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు నష్టం వాటిల్లుతుందని, ఆ దిశగా కార్పొరేట్ విద్యాసంస్థలను అణచివేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఉమ్మడిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, ప్రైవేట్ పాఠశాల సంఘం అధ్యక్షుడు శంభులింగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, ఎంఈవో మేక నాగయ్య, బి. కన్నయ్య, జె. అంజయ్య, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నకిరేకల్, సెప్టెంబరు 13, (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశ పెడుతున్న ప్రతి సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. నకిరేకల్‌లో శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన నరేంద్రమోదీ పుట్టిన రోజు, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళిమోహన్, పన్నాల సైదులు, చినేని జాని, గుడుగుంట్ల సాయన్న, భువనగిరి వెంకటేశ్వర్లు, చందుపట్ల వేణుమాధవ్, కారింగుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచేంత వరకు పోరాటం

నకిరేకల్, సెప్టెంబర్ 13, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచేంత వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాదిగ అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం 17, 18 వార్డులలో పెన్షన్ దారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పెన్షన్ల పెంపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకుడు వంటిపాక అంబేద్కర్, రాజలింగం, హన్మంతు, అంజయ్య, చింతయ్య, ఎల్లమ్మ, మంజుల, దీవెన, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మర్రిగూడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బేత మహేష్ సంబంధించిన రూ.80వేల విలువ చేసే ఎద్దు అదే గ్రామానికి చెందిన అబ్బనగోని వెంకటయ్య వ్యవసాయ భూమిలో మేత మేస్తుండగా పక్కన ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. అక్కడికక్కడేకే మృతి చెందినట్లు బాధితుడు బేత మహేష్ కంటతడి పెడుతూ తెలిపాడు.

పేదల పక్షపాతి ఏచూరి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తూ పేదల పక్షపాతిగా చిరస్థాయిగా నిలిచిన మహానాయకుడు సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లం మహేష్, సీనియర్ నాయకుడు అరూరి శ్రీనివాస్ అన్నారు. ఏచూరి ప్రథమ వర్ధంతి సభను శుక్రవారం రాత్రి చిట్యాల మండలం వెలిమినేడులో నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మతోన్మాద వైఖరిని ఎండగట్టేందుకు సీతారాం ఏచూరి పార్లమెంట్ లోపల, బయట విశేష కృషి చేశారని తెలిపారు. ప్రజా పోరాటాలను బలరపరచడమే ఏచూరికి అందించే ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో పంది నరేష్, నెలికంటి నర్సింహ, అరూరి దుర్గయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి, దేశబోయిన లింగస్వామి, దేశబోయిన నర్సింహ, అరూరి శంభయ్య, ఊషయ్య, ఆడెపు రమేష్, గడ్డం నర్సిరెడ్డి, బసవయ్య, గణేష్, సాయికిరణ్, ఇస్తారి, యాదిరెడ్డి, సురేష్, మనోజ్, నర్సిరెడ్డి, లింగయ్య, ఊషయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులకు వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలి

నల్లగొండకల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసినందున వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని పెన్షనర్స్ సంఘం నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధానకార్యులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ డిమాండ్ చేశారు. శనివారం పెన్షనర్స్ భవనంలో జరిగిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉద్యోగులకు, పింఛనర్లకు పీఆర్‌సీ, పెండింగ్ డీఏలను ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. చాలా మంది ఉద్యోగులు, పెన్షనర్స్ పీఆర్‌సీ, డీఏలు సరైన సమయానికి అందక చనిపోయిన వారు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగదు రహిత వైద్యసేవలకు సంబంధించిన జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 35 మంది పెన్షనర్లకు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గాయం నారాయణరెడ్డి, ఆంజనేయులు, జెల్లా శ్రీశైలం, రంగయ్య, రఘునాధం, కేశవాచారి, తాండూరి రమేష్, రవి ప్రసాదరావు, బిక్షం, శంకర్‌రెడ్డి, శంకరయ్య, ముత్తమ్మ, శ్రీవిద్య పాల్గొన్నారు.


పెన్షనర్ల జన్మదినం సందర్భంగా సన్మానిస్తున్న నాయకులు

హాస్టల్ సేవలు వినియోగించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వార్డెన్ వెంకన్న

మునుగోడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యో తి): ప్రభుత్వం హాస్టల్‌లో కల్పించే సౌకర్యాలు వంటి వివిధ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని మునుగోడు ఎస్సీ హా స్టల్ వార్డెన్ మన్నెం వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హా స్టల్‌లో అన్ని రకాలు వసతులు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు లక్ష్య సాధన కో సం కృషి పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని అన్నారు. అందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.

జిల్లాలో కురిసిన వర్షం


చండూరు ప్రధాన చౌరస్తాలో నిలిచిన వర్షం నీరు

చండూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒక్కసారిగా మారిపోయిన వాతావరణం కారణంగా శనివారం చండూరులో ఓ మోస్తారు వర్షం కురిసింది. 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందగా, ఈ వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ జలమయవడంతో ప్రధాన చౌరస్తాలో వర్షం, డ్రైనేజీ నీరు కలిసి ప్రధాన రహదారి పైకి రావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏడాదిగా పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు మందకొడిగా సాగుతుండటంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాంపల్లిలో భారీ వర్షం

నాంపల్లి: నాంపల్లి మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. వర్షానికి నాంపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డుపైకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షుడిగా నాగయ్య


ప్రమాణం చేస్తున్న ఎఫ్‌పీఎస్‌టీ నూతన జిల్లా కార్యవర్గం

నల్లగొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పీఎస్‌టీ) జిల్లా అధ్యక్షుడిగా ఏ. నాగయ్య ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని బోయవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో 2025-2027 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఏ.నాగయ్య (ఉరుమడ్ల హైస్కూల్), ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాస్‌రెడ్డి (దోరెపల్లి హైస్కూల్), కోశాధికారి టీ.చంద్రశేఖర్, పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఏ.వాణి, జానకి, సత్యవతి, కె.సైదులు, టీడేవిడ్, ఎన్.శ్రీనివాస్, వి.రాములు, కార్యదర్శులు వై.శ్యాంసుందర్‌రెడ్డి, పి.సాయిలు, కొండయ్య, మురహరి, గౌరవాధ్యక్షుడు టి.నర్సింహ, సలహాదారుగా ఫిజికల్ సైన్స్ టీచర్స్, జీహెచ్‌ఎంలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జీహెచ్‌ఎంలు బ్రహ్మంచారి, అశోక్‌రెడ్డి, నర్సింహ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో 75 మంది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

నల్లగొండరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు ట్యూటర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని హెచ్‌డబ్ల్యూఓఎస్ విజయలక్ష్మి అన్నారు. జిల్లాకేంద్రంలోని బాలికల క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన తల్లితండ్రుల సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు తాగునీరు సాయంత్రం స్నాక్స్ వారానికి ఐదు రోజులు, పండ్లు, గుడ్లు రెండు రోజులు చికెన్ భోజనం అందిస్తున్నట్లు వివరించారు. సమావేశానికి హాజరై విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు అందుకున్న భోజనం, వసతి సౌకర్యాల గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రతీ నెలా మెడికల్ క్యాంపులు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిబ్బంది స్వప్న, సత్యవతి, దూసరి భారతమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విద్యార్థినులు, తల్లిదండ్రులు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

శాలిగౌరారం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగోని రాజు డిమాండ్ చేశారు. శాలిగౌరారంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము విద్యాశాఖలో సమగ్రశిక్షలో భావితరానికి బంగారు బాటలు వేస్తున్న తమ భవిష్యత్తు అంధకారంగా మారిందని అన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా నిజ జీవితంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికీ వందలాది ఉద్యోగులు విధుల్లో ప్రమాదాల్లో, అనారోగ్యాలతో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ప్రభుత్వం మట్టి ఖర్చులు కూడా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకు విధుల్లో ఉండి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సిహెచ్ వెంకటకృష్ణ, బంటు వెంకటేశ్వర్లు, మంగ నిరంజన్, బొమ్మగోని సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం : కృష్ణారెడ్డి


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ పార్టీకి సైనికుల లాంటి కార్యకర్తలే బలమని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్లలో శనివారం నిర్వహించిన సమావేశంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ ఏమాత్రం తగ్గలేదని అన్నారు. అభూతకల్పనతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠాన్ని చూపుతుందని అన్నారు. హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం ప్రజలు, రైతుల్లో వ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు. ప్రజావ్యతిరేకత ఉన్న ప్రభుత్వాలు మనుగడను సాధించలేవని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్‌ను వీడకుండా పార్టీనే నమ్ముకున్న న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో చింతల సైదమ్మ, కురుపటి లింగయ్య, కురుపటి రామచంద్రం, ఇరుగు నరేష్, మట్టిపల్లి అంజయ్య, జనపాల లింగయ్య, కోరబోయిన స్వామి ఉన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాంపల్లిలో పైప్‌లైన్ ధ్వంసం

● వృథాగా పోతున్న కృష్ణాజలాలు


పైప్‌లైన్ పగలడంతో వృథాగా పోతున్న కృష్ణాజలాలు

నాంపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన కృష్ణాజలాల పైప్‌లైన్ పగిలింది. దీంతో శనివారం కృష్ణాజలాలు వృథాగా పోయాయి. గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించడంతో కృష్ణా జలాలు సరఫరా చేసే లైన్ నీటిని నిలిపివేశారు. అప్పటికే లక్షలాది లీటర్ల కృష్ణాజలాలు వృథాగా పోయాయి.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	2,74,007	2,74,007
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	1,137.95	633.70
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.406 (41.8320)	2,00,630	1,35,683

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240



దసరాకు 705 బస్సులు

- ప్రత్యేక బస్ సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళిక
- స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం
- పండుగ తరువాత మరో మూడు రోజులు కూడా
- డిమాండ్‌ను బట్టి ఆయా రూట్లలో అదనంగా..

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి 705 స్పెషల్ బస్ సర్వీసులను నడపాల ని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నల్లగొండ రీజియన్ రూపొందించిన నివేదికకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు ఆమోదం తెలిపారు.

– (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

దసరా సందర్భంగా ప్రత్యేక బస్ సర్వీసులను నడిపించేందుకు సంస్థ షెడ్యూల్‌ను రూపొందించింది. దసరా స్పెషల్ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడు డిపోల పరిధిలో 680 బస్సులు పలు రూట్లల్లో నిత్యం 2.60లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. అందుకు సంస్థకు ప్రతీ రోజు రూ.1.50కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రతీడిపో నుంచి హైదరాబాద్‌తో పాటు దూర ప్రాంతాలన్నింటికీ దసరా సందర్భంగా బస్సులు నడపనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు ప్రజలను చేరవేయడం కోసం హైదరాబాద్‌కు ఎక్కువగా సర్వీసులు నడపనున్నారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ బస్సులకు సంబంధించి కొన్ని రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. వాటిలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగించనున్నారు. రీజియన్‌లో డిమాండ్‌ను బట్టి అదనపు బస్సులు పెంచనున్నారు. పండుగ సందర్భం గా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా వారి గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు ప్రధానంగా పల్లెలకు గ్రామాలకు స్పెషల్ బస్సులు నడపనున్నారు.

20 నుంచి స్పెషల్ బస్సులు...

ప్రభుత్వం పాఠశాలలకు ఈనెల 21 నుం చి అక్టోబరు 3వ తేదీ వరకు దసరా సెలవుల ను ప్రకటించింది. అదేవిధంగా కళాశాలలకు ఈనెల 28 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు సెలవులు ఇచ్చింది. బతుకమ్మ పండుగ ఈ నెల 21న ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు కొనసాగి 30వ తేదీన సద్దుల బతుకమ్మతో ముగియనుంది. బతుకమ్మ, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు, దసరా నేపథ్యంలో ఈనెల 20వ తేదీ నుంచే ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది. ప్రయాణికులను వారి గమ్యాలకు చేరవేయడంతో పాటు ఆదాయం కూడా సమకూర్చుకునేందుకు పండుగకు ముందస్తుగానే బస్సు సర్వీసులు నడిపేందుకు నిర్ణయించింది. దసరా సెలవుల్లో పట్టణ ప్రాంతాల నుంచి అధికంగా పల్లెలకు వెళ్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అక్టోబరు 2వ తేదీ వరకు మొత్తం 13 రోజుల పాటు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి స్పెషల్ బస్సులు నడిపిస్తారు. అదేవిధంగా గ్రామాలకు వెళ్లిన వారు పండుగ తరువాత 3, 4, 5 తేదీల్లో పట్టణాలకు తిరుగుముఖం పడతారు. ఈ రోజుల్లో కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను ఎంచుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. అదేవిధంగా మహిళలకు ఉచిత ప్రయాణంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ వస్తున్న నేపథ్యంలో సంస్థ మహిళా ప్రయాణికుల కోసం పెద్ద సంఖ్యలో బస్సులు నడపనుంది.

డిపోల వారీగా బస్సుల సర్వీసులు ఇలా...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు డిపోలు ఉన్నాయి. ఈనెల 20 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నడిపే బస్సుల వివరాలను ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ఆ తరువాత మరో మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులను కొనసాగించనున్నారు. ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటే అదనంగా మరో 30 నుంచి 50సర్వీసులను అప్పటికప్పుడే నడిపేలా ఏర్పాట్లు చేశారు. దేవరకొండ డిపో పరిధిలో 131 బస్సు సర్వీసులు, కోదాడ పరిధిలో 94

– మిగతా 6వ పేజీలో...

16 నుంచి కళాశాలలు బంద్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో..



హైదరాబాద్ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రైవేట్ కళాశాలల యజమానులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఈ నెల 16 నుంచి బంద్ నిర్వహించనున్నాయి. గతంలో 40 రోజులు సమ్మె నిర్వహించగా, ప్రభుత్వం మూడు రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని నాడు హామీ ఇచ్చింది. ఈ హామీ నెరవేరకపోవడంతో మళ్లీ బంద్ పాటించాలని యాజమాన్యాలు నిర్ణయించాయి.

– (ఆంధ్రజ్యోతి, మోత్కూరు)

పట్టభద్రులైన నిరుద్యోగులు కొందరు పలువురు విద్యార్థులకు విద్య అందించడంతోపాటు స్వయం ఉపాధి, మరికొందరికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఇచ్చే ఫీజులపై ఆధారపడి ఇవి నడిచేవి. అయితే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో నాటి నుంచి ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి నడుస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఏడాది, ప్రస్తుత కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చే య లేదు. దీంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వందే కళాశాలలు నడపలేమంటూ ఈ నెల 16 నుంచి నిరవధిక బంద్‌కు వెళ్లనున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి ఇటీవల కళాశాలల యాజమాన్యాలు సమ్మె నోటీసు అందజేశాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 62 ప్రైవేట్ డిగ్రీ, 15 పీజీ కళాశాలలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 62 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, 15 ప్రైవేట్ పీజీ కళాశాలలు ఉన్నాయి. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సుమారు 16వేల మంది విద్యార్థులు, పీజీ కళాశాలల్లో సుమారు 2వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో అత్యధిక భాగం నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉన్నారు.


మూడేళ్లుగా బకాయిలు

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఏడాది, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థుల ఉపకార వేతనాలు విడుదల చేయలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ కళాశాలలకు 2022-23,2023-24,2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.250కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో టోకెన్ ఇచ్చిన మొత్తం.

– మిగతా 6వ పేజీలో...

వెంటనే నిధులు విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏప్రిల్, మే మాసాల్లో 40 రోజులు సమ్మె చేశాం. మూడు రోజుల్లో కొంత బకాయి చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదు. ఇప్పటికే పలుమార్లు డిప్యూటీ సీఎంతో పాటు పలువురు మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశాం. ఉన్నత విద్యాశాఖ అధికారులను కలిశాం. అయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదు. భవనాలకు అద్దె, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నాం. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 16 నుంచి నిరవధిక బంద్‌కు వెళ్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి కళాశాల యాజమాన్యాలకు, విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలి.



– సత్యంగౌడ్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, నల్లగొండ

వీధి కుక్కలను దత్తత తీసుకోవడం అభినందనీయం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కుక్కల దత్తత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలను దత్తత తీసుకోవడం అభినందనీయమని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కుక్కలను నియంత్రించేందుకు వాటిని చంపడం పరిష్కారం కాదని, వాటి సంతతిని నిరోధించడం, దత్తత తీసుకునేలా ప్రోత్సహించడం మంచి ప్రయత్నమని అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ పార్కులో నిర్వహించిన కుక్కల దత్తత, స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వీధి కుక్కలపై నియంత్రణ లేకపోవడంతో ఇటీవల కుక్కల బెడద పెరిగిందని, కుక్క కాట్లతో విషాదకర ఘటనలు నెలకొన్నాయన్నారు. ఈసమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని, అందులో భాగంగానే వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేయడంతో పాటు వాటిని పెంచుకునేందుకు దత్తత తీసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వివరించారు.రాష్ట్రంలో హైదరాబాద్ నగరం తర్వాత నల్లగొండలోనే ఈ దత్తత కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, సామాజికపరమైన ఇలాంటి అంశంపై సరైన రీతిలో స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని మంత్రి అభినందించారు. జిల్లాలో సుమారు 40 వేల కుక్కలు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోందన్నారు. అనంతరం 49కుక్కలను దత్తత తీసుకున్న వారిని మంత్రి అభినందించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో 92వేల గృహాలు ఉండగా, ఒక్కొక్కరు ఒక్కో కుక్కను దత్తత తీసుకుంటే వాటి బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే బీ.లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఏఎస్పీ మౌనిక, రమేష్, డీఎఫ్‌వో రాజశేఖర్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ రమేష్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి

పురుషులతో పాటు, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్బీసీ కాలనీ సమీపంలో జిల్లా మహిళా సమాఖ్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త రూ.5కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ పంపునకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల ద్వారా కట్టంగూరు మండలం అయిటిపాములలో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐవోసీఎల్ జనరల్ మేనేజర్ సుదీప్‌రాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.232కోట్లతో పోలీసులకు క్వార్టర్స్

రాష్ట్రవ్యాప్తంగా రూ.232కోట్లతో పోలీసు అధికారులు, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్మించిన ఏఆర్ డీఎస్పీ, సీఐ, ఎస్ఐ క్వార్టర్లను, శిశువిహార్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి.రమేష్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐజీ ఇక్బాల్, ఎస్పీ శరత్‌చంద్ర పవర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యల పాఠాలు

- అద్దె భవనాల్లో ఇక్కట్లు
- ప్రహరీలు లేక పాములు, తేళ్ల సంచారం

6

ప్రాణాలు నిలబెట్టే ప్రథమ చికిత్స

ప్రజల సౌకర్యం కోసం లోక్‌అదాలత్

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా 13 లోక్‌అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో 71 సివిల్ కేసులు, 15,921 క్రిమినల్, 96 మోటార్ వాహన ప్రమాద బీమా, 50 బ్యాంక్, 73 సైబర్ క్రైం, 35 ట్రాన్స్‌కో, 10,446 ట్రాఫిక్ చలాన కేసులు మొత్తం 26,692 కేసులను పరిష్కరించామన్నారు. అందులో ప్రమాదబీమా రూ.5.95కోట్లు, రూ.32,83,184లను బ్యాంకుల నుంచి పరిహారం ఇప్పించామన్నారు. సైబర్ క్రైం కేసుల్లో రికవరీ డబ్బులు రూ.4,51,245 ఇప్పించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి పురుషోత్తంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు శాపంలా సీపీఎస్

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దర్శన్‌గౌడ్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 29: సీపీఎస్ విధానం ఉద్యోగులకు శాపంలా మారిందని సీపీఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లింగమొల్ల దర్శన్‌గౌడ్ అన్నారు. శనివారం స్థానికంగా జరిగిన పించన్ జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2004 అనంతరం రాష్ట్ర ప్రభుత్వ కొలువుల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పించన్ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాగవెల్లి ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు కొరివి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగ నర్సింహులు, భూలక్ష్మి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మనబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్



భిక్షం గౌడ్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటామని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై శనివారం నల్లగొండ పట్టణానికి వచ్చిన ఆయనకు పీఆర్టీయూ శ్రేణులు ఘనంగా స్వాగతంగా పలికాయి. పట్టణంలోని ఆయన నివాస గృహంలో ఉపాధ్యాయులు నిర్వహించిన ఆత్మీయ సన్మానంలో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్ల అవుతున్నా నేటికీ విద్యారంగం పలు సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. ప్రధానంగా ఏళ్లుగా పేరుకు పోయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు వస్తాయని, దీంతో పాటు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు, ఇతర బిల్లులు మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌రెడ్డి, నాయకులు బూరుగు లింగయ్య, వీరమల్ల శ్రీనివాస్, నాగయ్య, యాదయ్య, కృష్ణ, భద్రీనాథ్, జిల్లాలోని పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

మాడ్గులపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజలాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శనివారం పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పోలగాని సైదులు, ఉగ్గిడి సత్యనారాయణ, గొట్టిముక్కల నాగాచారి, బారి కొండయ్య, సింగం కార్తీక్, రామ్మూర్తి, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును ఆగం చేయవద్దు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును ఆగం చేయవద్దని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8వేల కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో బీఆర్ఎస్ చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందని, విద్యార్థుల ఉసురు పోసుకోవద్దని కోరారు. కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించాలన్నారు.

'ముప్పారం' లిఫ్టు మరమ్మతులు పూర్తి చేయాలి


ముప్పారం లిఫ్టును పరిశీలించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలం ముప్పారం గ్రామంలోని ఎల్ 3 ఎత్తిపోతల పథకం మరమ్మతులు తక్షణమే పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాన్ని ఆయన శనివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఇన్‌టెక్ వెల్ కూలిపోయి ఏడాది గడిచిన మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇన్‌టెక్ వెల్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో లిఫ్టు కింద 4800 ఎకరాలు బీళ్లుగా మారాయని విమర్శించారు. టెండర్లు పూర్తయినా ఎత్తిపోతల పథకంపై ఇప్పటివరకు కనీసం సమీక్ష నిర్వహించలేదని, రెండు నెలల్లో పూర్తి చేసే మరమ్మతులను ఏడాది వరకు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, సీఎం రేవంత్‌రెడ్డి చేతగానితనం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించా రు. ఎరువుల సరఫరాలో కేసీఆర్‌ను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. రైతులు వచ్చే ఏడాది కోసం యూరియాను దాచుకుంటున్నందునే కొరత ఏర్పడిందని ఎంపీ రఘువీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కూరాకుల వెంకటేశ్వర్లు, తాటి సత్యపాల్, నల్లబోతు వెంకటేశ్వర్లు, మాచర్ల దాసు, పిల్లి రాజు, మెరుగు రామలింగం, బొల్లం సైదులు, భాస్కర్, నాగరాజు, శ్రీను, కొండల్, గౌరు సాయి, మణి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్. కృష్ణయ్య బీసీల ఆరాధ్యదైవం


కేక్ కట్ చేస్తున్న పగిడి జీడయ్యయాదవ్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య బీసీల ఆరాధ్యదై వమని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలను విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్న కృష్ణయ్య మరెన్నో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవాలని అన్నారు. ఆయన చేసిన పోరాటాల వల్లే బీసీలకు ప్రాధాన్యత లభిస్తోందన్నారు. అనంతరం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జక్క నాగేశ్వరరావు, అశోక్, గంగాధర్, వెంకటేష్, ప్రసాద్, శంకర్, సతీష్, వినయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ గ్రహీతకు సన్మానం


జావిద్‌ను అభినందిస్తున్న సంఘం సభ్యులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌డీ పురస్కారం అందుకున్న వేములపల్లి మండల వాసి షేక్ జావిద్‌ను పట్టణంలోని పెద్దమసీదులో ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు ఎండీ. ఖాజాహమీదుద్దీన్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు విభాగంలో జావిద్ ముస్లింవాద సాహిత్యం-వాస్తవికత అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించి, పీహెచ్‌డీ పురస్కారం అందుకోవడం ఆదర్శనీయమన్నారు. జా విద్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎండీ. అస్లాం, ఎండీ.అయూబ్‌ఖాన్, నాహిద్, జహంగీర్, కౌసర్, మన్నన్, అబ్బాస్, జుబేర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు నేనావత్ కిషన్‌నాయక్ అన్నారు. దేవరకొండ మండలం గన్యానాయక్‌తండాలో శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మలక్‌పేట యశోద ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన మెగా కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తండాలోని 200మందికి ఉచిత కంటి పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సభ్యులు మల్లయ్య, అంజనేయులు, మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, గాజుల అంజనేయులు, యశోద ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం

డిండి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల బాలుర వసతిగృహంలో మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందజేస్తున్నామని వసతిగృహ సంక్షేమ అధికారి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని వసతిగృహంలో శనివారం తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నట్లు వివరించారు. బెడ్ షీట్లు, కార్పెట్లు, నోట్ పుస్తకాలు, పారగాన్ చెప్పులు, నాలుగు జతల దుస్తులు, కాస్మోటిక్ చార్జీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాస్, హెచ్‌ఎం రామరావు, రిటైర్డ్ హెచ్‌ఎంలు శేఖర్‌రెడ్డి, ఖాజా, రుక్సానా పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో యూత్ హాస్టల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దవూర మండల కేంద్రంలో సిద్దార్థ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2007-28 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న నాటి విద్యార్థులు 18 సంవత్సరాల తర్వాత ఒక్కచోట చేరుకొని నాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు వెంకటయ్య, సైదిరెడ్డి, నర్సింహ, నాటి విద్యార్థులు పిల్లి అభినయ్, నాయిని అనురూప, ఆదిరాల శేఖర్, ప్రియాంక, మానస, అంజలి, పద్మ, రేణుక, రమణ, విజయలక్ష్మి, రమాదేవి, సైదులు, మల్లిఖార్జున్, ఆంజనేయులు, జనార్ధన్, నరేందర్, వెంకటరమయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పనితిప్పలు

● చెప్పులు, టోకెన్లతో రైతుల లైన్

మాడ్గులపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద రైతులు చెప్పులతో పాటు టోకెన్లను వరుస క్రమంలో ఉంచి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండలకేంద్రానికి శనివారం యూరియా వచ్చిందన్న సమాచారంలో రైతులు అధిక సంఖ్యలో పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయాధికారులు మండల కేంద్రానికి యూరియాను తక్కువగా తీసుకురావడంతో ఈ సమస్య తలెత్తుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కోసం అధిక సంఖ్యలో రైతులు వచ్చారు. కానీ కేంద్రానికి 400 బస్తాలే రావడంతో రైతులకు వచ్చిన బస్తాలకు పొంతన లేకుండా పోయింది. దీంతో చేసేదేమీ లేక రైతులు చెప్పులు, టోకెన్లతో నిలబడి తీసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలకు ఎక్కువ యూరియాను వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


డిండిలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

పోలీస్ పహారా నడుమ యూరియా పంపిణీ

డిండి: మండల కేంద్రంలో శనివారం రైతులకు పోలీస్ పహారా నడుమ రైతులకు యూరియా అందజేశారు. తెల్లవారుజాము నుంచే యూరియా టోకెన్ల కోసం డిండి సొసైటీ పరిధిలోని కార్యాలయం ఎదుట రైతులు క్యూ లైన్‌లో నిలబడ్డారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు తెల్లవారుజాము నుంచే యూరియా కోసం వేచి ఉన్నారు. కొద్దిసేపు రైతుల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు కలుగజేసుకొని యూరియా పంపిణీ పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. డిండి ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో 12వేల ఎకరాలు ఈ వానాకాలం సాగులోకి రావడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. డిండి సొసైటీకి 290మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారి రెహెనా తెలిపారు. రెండు బస్తాల యూరియా కోసం తెల్లవారుజాము నుంచి వేచి ఉండాల్సిన వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


మాడ్గులపల్లిలో చెప్పులు, టోకెన్లను లైన్‌లో ఉంచిన రైతులు

నేడు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

దామరచర్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపురం సబ్‌స్టేషన్ 33కేవీ లైన్ షిఫ్టింగ్ పని జరుగుతున్నందున ఆదివారం తిమ్మాపురం ఫీడర్, కల్లెపల్లి ఫీడర్, పడమటితండా ఫీడర్, తిమ్మాపురం లిఫ్ట్ ఫీడర్ల కింద ఉన్న గ్రామాలకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ అబ్దుల్లాహబీబ్ శనివారం తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వీటీనగర్ కొండపై ఉట్లు

చింతపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీటీనగర్ కొండపై శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైష్ణవ ఆచార సంప్రదాయ ప్రకారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చేయాలని ఆయన కోరారు.

కమ్యూనిస్టులే సాయుధ పోరాట వారసులు

● సాయుధ పోరాట వారోత్సవాల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి


పద్మట్‌పల్లిలో అమరవీరుల స్తూపాలకు నివాళులర్పిస్తున్న నర్సింహారెడ్డి, సీపీఐ నేతలు

దేవరకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాయుధ పోరా ట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం దేవరకొండ మండలం పద్మట్‌పల్లిలో అమరవీరుల స్మారక స్తూపం వద్ద పూలమాలలు వే సి నివాళులర్పించి మాట్లాడారు. నైజాంను తరిమికొట్టి ప్రజల కు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించిన ఘనత కమ్యూనిస్టులకే ఉందన్నారు. భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కో సం సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాటం చేసి నిజాం, ని యంత పాలన నుంచి తెలంగాణను విముక్తి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతోమంది అమరులయ్యారని అ న్నారు. అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ సా యుధ రైతాంగ పోరాటానికి దేశ చరిత్రలో ఓ స్థానం ఉందని పేర్కొ న్నారు. నైజాం వ్యతిరేక పోరాటంలో బీజేపీ పాత్ర లేదన్నారు. ఈ నె ల 17వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వా రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పద్మట్‌పల్లి నుం చి దేవరకొండ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, నాయకులు షైనుద్దీన్, దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, వలమాల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి, కిన్నెర యాదయ్య, వెంకటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

హాలియా: తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతోమంది అమరులయ్యారని, వారి త్యాగాలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. హాలియాలోని పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన మహోత్తర వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని చరిత్రను బీజేపీ వక్రీకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శులు దైద శ్రీను, దుబ్బ రాంచంద్రయ్య, కందుకూరు కోటేష్, జటావత్ రవినాయక్, ఆకారపు నరేష్, కారంపూడి ధనమ్మ, కోరే రమేష్, మల్లికంటి చంద్రశేఖర్, రెవెల్లి వెంకటేశ్వర్లు, మహేష్, సామంతు, వర్షిత్ పాల్గొన్నారు.

పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ

మిర్యాలగూడరూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని యాదగిరిపల్లి గ్రామంలో అమరవీరుడి స్తూపానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మద్దిరాల రంగారెడ్డి, జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, బిల్లా కనకయ్య, ఎండి.సయ్యద్, ధీరావత్ లింగానాయక్, వల్లంపట్ల వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

సోషల్‌మీడియాతో పెరుగుతున్న నేరాలు

● అదనపు జిల్లా జడ్జి వేణు


లోక్‌అదాలత్‌లో రాజీపడిన వారికి పత్రాలు అందజేస్తున్న జడ్జి వేణు

మిర్యాలగూడలీగల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సామాజిక మా ధ్యమాల(సోషల్ మీడియా) ద్వారా నేరాలకు ఆకర్షితులవుతున్నారని మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.వేణు అన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకొని శనివారం కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. గతంలో నేరం చేసిన వారే మళ్లీమళ్లీ చేసేవారని క్రమేణా అలా కాకుండా సోషల్‌మీడియాను విరివిగా వాడుతూ కొత్తవారు కొత్త నేరాల వైపు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు పశ్చాత్తాపంతో లోక్‌అదాలత్‌ల ద్వారా రాజీ చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, ప్రధాన, అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు పవన్‌కుమార్, లావణ్య రాణి, అరుణ్‌తేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి భూపతిరెడ్డి, అడిషనల్ పీపీ రఘురామారావు, లోక్‌అదాలత్ సభ్యులు ప్రభాకర్, రాజశేఖర్, మోదాల మల్లేష్, కొంక వెంకన్న, మట్టయ్య, రామకృష్ణ పాల్గొన్నారు. కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు అందచేశారు. యునికేర్ హెర్బల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి న్యాయవాదులు, కక్షిదారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మిర్యాలగూడ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 164 కేసులు పరిష్కరించినట్లు న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, ప్రధాన, అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు పవన్‌కుమార్, లావణ్యరాణి, అరుణ్‌తేజ్ తెలిపారు. వీటిలో 151 క్రిమినల్ కేసులు, 13 సివిల్ కేసులను పరిష్కరించినట్లు వారు తెలిపారు.



దేవరకొండ: జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత

రాజీమార్గమే రాజమార్గం : సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత

దేవరకొండ: రాజీమార్గమే రాజమార్గమని, కక్షిదారులు తమ, తమ కేసులను రాజీ కుదుర్చుకొని పరిష్కరించుకోవాలని న్యాయసేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. దేవరకొండ మున్సిఫ్ కోర్టులో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. భూతగాదాలను కూడా పరిష్కరించుకొని కలిసి మెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేవీ ఎస్.హరీష్‌బాబు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్నేహ, దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, ఏపీపీలు సంతోష్‌కుమార్, రూపాంజలి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్, ఏజీపీ రమాశంకర్, సీనియర్ న్యాయవాదులు నెమికంటి గౌరిశంకర్, ఆంజనేయులు, అశోక్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

దేవరకొండ డివిజన్‌లో ముసురుతో కూడిన వర్షం

దేవరకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో శనివా రం ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. వర్షాలకు దేవరకొండ పట్టణంలోని ప్రధాన వీధులు జలమయయ్యాయి. డివిజన్‌లోని రైతులు ఈ సంవత్సరం 1.40లక్షల ఎకరాల వరకు పత్తిసాగు చేశారు. పత్తిపంట ఏపుగా పెరిగింది. వర్షాలు పత్తి పంటకు మేలు చేస్తాయని రైతులు తెలుపుతున్నారు. రెండు రోజుల పాటు తుఫాన్‌తో కూడిన వర్షాలు ఉన్నందున డివిజన్‌లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి వర్షం వల్ల ఏమైనా నష్టం జరిగితే వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

చింతపల్లి: చింతపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ముసురుతో కూడిన వర్షం ఎడతెరపి లేకుండా కురియడంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా సైడ్ డ్రైనేజీ పూర్తిగా ఏర్పాటు చేయకపోవడంతో వర్షపునీరు యాచారం మండలంలోని పాత మాల్ మార్కెట్ నుంచి నేరుగా వ్యాపారస్థుల సముదాయాల్లోకి చేరుతుంది. దీంతో కొంత మేరకు ఆస్తి నష్టం కలుగుతుందని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


చింతపల్లి మండలంలోని వీటీనగర్‌లో కురుస్తున్న వర్షం

యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలి


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తిరుమలగిరి (సాగర్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియాను సక్రమంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జటావత్ రవినాయక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం ఆధ్వర్యంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు షేక్ చాంద్‌పాషా, ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్, శివ పాల్గొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఐ వెంకట్‌రెడ్డి

దేవరకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. దేవరకొండలోని వివిధ ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. యూరియాను అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎమ్మార్పీ రేటుకే యూరియాను విక్రయించాలని వ్యాపారులను కోరారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు బోర్డుపై ఉంచాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రంగయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


రంగయ్య అంతిమయాత్రలో పాడె మోస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అమరుల ఆశయాలను కొనసాగించేందుకు ఎర్రబావుటాను ఎత్తి పట్టాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కన్నెకంటి రంగయ్య (108)అనారోగ్యంతో శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన స్వస్థలమైన యాద్గార్‌పల్లిలో శనివారం పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. రంగయ్య భౌతికకాయంపై జూలకంటి రంగారెడ్డి ఎర్రజెండా కప్పి జోహర్లు అర్పించారు. అంతిమయాత్రలో పాడెను మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాములు, జమీందారులు నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పేదల పక్షాన పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. శత్రువు దాడులకు వెరవక ఆయన చూపిన ధైర్య సాహసాలను పార్టీ గుర్తించి దళకమాండర్‌గా నియమించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లో జరిగిన పోరాటాల్లో రంగయ్య పాల్గొన్నట్లు తెలిపారు. పార్టీ కార్యకలాపాలపై నిర్బంధం పెరిగినప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లి రహస్యోద్యమాన్ని నిర్మించారని గుర్తు చేశారు. ఉద్యమక్రమంలో పోలీసులు అరెస్ట్ చేయడంతో జైలు జీవితాన్ని గడిపారని అన్నారు. ఊరూరా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతుల్ని చేశారని అన్నారు. రంగయ్య నమ్మి ఆచరించిన సైద్ధాంతిక బాటలోనే ముందుకు సాగుతూ సమసమాజ స్థాపనకు అందరం కృషిచేయాలని కోరారు.

మిర్యాలగూడ మండల తొలి ఎంపీపీ

కన్నెకంటి రంగయ్య సర్పంచ్ వ్యవస్థ ఏర్పడగానే యాద్గార్‌పల్లి మొదటి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మండల వ్యవస్థ ఏర్పాటుతో మిర్యాలగూడ మండల పరిషత్‌కు ఎంపీపీగా ఎన్నికై సేవలు అందించారు. అంతేకాక సింగిల్ విండో వైస్ చైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు.

● రంగయ్యకు పలువురు నాయకుల నివాళి

కన్నెకంటి రంగయ్య మృతిపట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు సంతాపాన్ని తెలిపారు. సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఫోన్‌ద్వారా నివాళులర్పించారు. రంగయ్య భౌతిక దేహాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, చౌగాని సీతారాములు, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఎండి.సయీద్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, గుండు నరేందర్, లింగయ్య నివాళులర్పించారు.